క్లుప్తంగా

పార్లమెంట్ స్థానానికి ఎన్‌పీ వెంకటేశ్ దరఖాస్తు



స్టేషన్ మహబూబ్‌నగర్: ఎంపీ ఎన్నికల నేపథ్యంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరుతూ న్యాయవాది ఎన్‌పీ వెంకటేశ్ ముదిరాజ్ శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. పార్లమెంట్ పరిధిలో 54శాతం బీసీలు ఉన్న నేపథ్యంలో తనకు టికెట్ కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం అని ఎన్టీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ అన్నారు. ఈమేరకు కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో ఉద్యోగాలు పొందాలంటే విద్యార్థులకు డిజిటల్ అక్షరాస్యత, డిజిటల్ పరివర్తన, సాఫ్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరం అన్నారు.

ఉద్యోగస్తులను ఆదుకోవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉద్యోగస్తుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించి ఆదుకోవాలని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫారుఖ్ హుస్సేన్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న విధంగా పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు, ఈకుబేర్‌లో గత రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఉద్యోగస్తుల బిల్లుల మంజూరుకు సీఎం ఆదేశాలు జారీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రోడ్డుకు మరమ్మతు

రాజాపూర్: ఈద్గాన్‌పల్లి ఎంపీటీసీ చావ్‌లీబాయ్ కుమారుడు వెంకట్‌నాయక్ శనివారం తండా వరకు ఉన్న రెండు కిలోమీటర్ల రోడ్డుకు రూ. నాలుగు లక్షల సొంత ఖర్చులతో మరమ్మతు చేయించారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో చర్యలు చేపట్టారు. మరమ్మతు చేయించిన నేపథ్యంలో తండావాసులు వెంకట్‌నాయక్‌ను అభినందించారు.

రేపు సోషల్ ఆడిట్

గండేడ్ : ఉపాధి హామీ పనులపై ఈనెల 5న ఎంపీడీఓ కార్యాలయంలో సోషల్ ఆడిట్ నిర్వహించనున్నారు. ఈమేరకు వివరాలను ఎంపీడీఓ శంకర్‌నాయక్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈజీఎస్ అధికారులు ఆడిట్‌కు హాజరు కానున్నట్లు తెలిపారు.

భారతరత్న ప్రకటనపై హర్షం

పాలమూరు: ఎల్.కె అద్వానీకి కేంద్రం ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం గొప్ప విషయమని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన సేవలకు తగిన ఫలితం లభించిందని హర్షం వ్యక్తం చేశారు.

'పల్లెకు పోదాం' చలో..చలో!



నవాబుపేట: పల్లెకు పోదాం కార్యక్రమంతో బీజేపీ పార్టీని మరింత బలోపేతం చేయాలని... దీనికి కార్యకర్తలు పట్టుదలతో పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని కార్యాలయంలో అధ్యక్షుడు రాజు అధ్యక్షతను ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి గావ్‌చలో కార్యక్రమంతో కేంద్రం పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, రాజు, పార్లమెంట్ ఇన్‌చార్జ్ బుడ్డయ్య, జిల్లా మీడియా ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, లక్ష్మీనారాయణ, యాదయ్య, మొబైల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కందులు క్వింటాలు రూ.9,870

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం కందులు క్వింటాలు గరిష్టంగా రూ.9,870, కనిష్టంగా రూ.9,059 ధర కేటాయించారు. అలాగే వేరుశనగ క్వింటాలు గరిష్టంగా రూ.7,386, కనిష్టంగా రూ.4,629, ఆర్ఎన్ఆర్ రకానికి క్వింటాలు రూ.2,241, పత్తి గరిష్టంగా రూ.6,500, కనిష్టంగా రూ.5,178, పెబ్బర్లు రూ.6,879, ఉలువలు రూ.7,111, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,259, కనిష్టంగా రూ.1,998 ధరలు లభించాయి.

'ప్రత్యేక' దృష్టి అవసరం

● అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్



కొత్తపల్లిలో సమస్యలపై ఆరాతీస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

నవాబుపేట: గ్రామ సమస్యలపై ప్రత్యేక అధికారులు దృష్టిసారించి.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కొత్తపల్లి, కొత్తపల్లితండా గ్రామపంచాయతీలను ఆయన పరిశీలించారు. ఈ పంచాయతీ రికార్డులు పరిశీలించారు. స్పెషల్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం విషయంలో నిరంతరం పర్యవేక్షణ చేసి సమస్యలు రాకుండా చూడాలన్నారు. నిత్యం మండల అధికారులతో సమన్వయం చేసుకుని గ్రామాల నిర్వహణ చూడాలన్నారు. రికార్డుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో ట్యాక్సుల వసూలు తదితర వాటిపై పంచాయతీ కార్యదర్శితో సమవేశమవ్వాలన్నారు. ప్రణాళికల ప్రకారం పన్నుల వసూలు చేయాలని ఆయన వివరించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్, ఈఓపీఆర్‌డీ బద్రునాయక్, ఏపీఓ జ్యోతి తదితరులు ఉన్నారు.

కోయిల్‌కొండ: ప్రత్యేక అధికారులు పాలకవర్గంలేని లోటు కనిపించకుండా.. గ్రామాల్లో సమస్యలు రాకుండా చూడాలని తహసీల్దార్ భరత్, ఎంపీడీఓ జయరాములు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కార్యాలయం నుంచి మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేకాధికారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం మాట్లాడారు. ముఖ్యంగా తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని ... ప్రత్యేక అధికారులదే బాధ్యత అని అన్నారు. ఏపీఎం నజీర్‌హైమద్, వ్యవసాయాధికారి రాంపాల్, పశువైద్యాధికారి రేవంత్ పాల్గొన్నారు.

బాలానగర్: గ్రామాల్లో ప్రజల అవసరాలపై ప్రత్యేక దృష్టి వహించాలని మండల ప్రత్యేక కార్యదర్శి బాబురావ్ అన్నారు. శనివారం గౌతాపూర్‌లో పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించి సూచనలు చేశారు. మొక్కలకు స్వయంగా నీరు పట్టారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.



గౌతాపూర్‌లో మొక్కలకు నీరు పడుతున్న ప్రత్యేక అధికారి బాబురావ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రత్యేక అధికారులు

వైభవంగా గంధోత్సవం



గంధోత్సవంలో పాల్గొన్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం షాసాబ్‌గుట్ట హజ్రత్ సయ్యద్ మర్దాన్ అలీషా దర్గా 98వ ఉర్సు ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన గంధోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గంధోత్సవాన్ని షేక్ మొహియొద్దీన్ ఇంటి నుంచి వన్‌టౌన్, న్యూటౌన్‌ల మీదుగా దర్గా వరకు తీసుకెళ్లారు. ఊరేగింపులో భక్తులు భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం దర్గాలో చాదర్లు, పూలు సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్గాలో ప్రార్థనలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దీపోత్సవం, ఖవ్వాలి కార్యక్రమం ఏర్పాటు చేస్తామని, 5న దర్గాలో ఖత్మే ఖురాన్ నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తామని పీఠాధిపతి రజాక్‌షాఖాద్రీ తెలిపారు. ఉర్సు ఉత్సవాల సందర్భంగా దర్గా ప్రాంగణంలో దుకాణాల సందడి నెలకొంది.

ప్రాథమిక పాఠశాలల్లో తనిఖీ

నవాబుపేట: మండలపరిధిలోని పాఠశాలలను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తూక్యాతండా, యన్మన్‌గండ్ల, హన్మసానిపల్లి, కూచూర్, రుక్కంపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, పలు రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, బోధన విషయంలో సిలబస్ ప్రకారం నూతన విధానాలు అనుసరించాలని సూచించారు. తరగతి గదులు, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని వివరించారు.

అమ్మకానికి ఔషధ మొక్కలు



ఔషధ మొక్కలతో విద్యార్థులు

గండేడ్: తక్కువ ధరలకు ఔషధ మొక్కలు అమ్మడంతో, ఎగ్జిబిషన్‌ను వెన్నాచేడ్ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేశారు. అంకుర పథకం కింద ఎంపికైన నేపథ్యంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులతో కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఆయా రకాల మొక్కలను పలుచోట్ల నుంచి తీసుకువచ్చారు. ఇందులో విలువైన ఔషధ మొక్కలు ఉన్నాయని విద్యార్థులు వివరించారు. వాటి ఔషధగుణాల గురించి అవగాహన కల్పిస్తున్నారు. మార్కెట్లో ఒక్కో మొక్క రూ. 500 నుంచి రూ. 2500 వరకు ఉంటుందని... అంకుర పథకంలో భాగంగా వీటిని రూ. 100కే తాము విక్రయిస్తున్నట్లు వివరించారు. సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం



మిడ్జిల్‌లో తహసీల్దార్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు

మిడ్జిల్: దేశవ్యాప్తంగా ఈ నెల 16న నిర్వహించనున్న సమ్మెలో భాగంగా శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ సాయిలక్ష్మికి కార్మికులు నోటీసులు అందజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చి పదేళ్లు అవుతున్నా కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. పంచాయతి కార్మికులు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డివైడర్ మీదికి దూసుకెళ్లిన కారు



అడ్డాకుల: మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై కాటవరం స్టేజీ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదృష్టవశాత్తు ఇద్దరికి ముప్పు తప్పిపోయింది. వివరాలు ఇలా.. గద్వాల నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న కారుకు కాటవరం స్టేజీ దాటిన తర్వాత వెనుక నుంచి వచ్చిన లారీ తగిలింది. దీంతో కారు డివైడర్ మీదికి దూసుకెళ్లి ఆగిపోయింది. కారులో ఉన్న రవి, మధు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. కాగా ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బాధితుడికి పరామర్శ

భూత్పూర్: మద్దిగట్లలో గడ్డమీది రాములును శనివారం కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజు తదితరులు పరామర్శించారు. జనవరి 13న గ్రామంలోని దళితవాడ ఎదుట ఉన్న గేదెల షెడ్డును తొలగించాలని, బావిలో విడిచి పెడుతున్న వ్యర్థాలతో ఇబ్బందులకు గురవుతున్నామని కోరగా అతడిపై పశువుల కాపరితో దాడి చేయించారని అన్నారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని తెలిపారు. కాగా కాపరిని ప్రోత్సహించిన షెడ్డు యజమాని మల్లారెడ్డిపై సైతం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసునమోదు చేయాలని, ఎఫ్ఐఆర్‌లో ఎ1 చేర్చాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా షెడ్డును తొలగించాలని అన్నారు. సరోజ, జె. చక్రవర్తి, సైదమ్మ, ఎర్రమోహన్ కృష్ణ తదితరులు ఉన్నారు.

బెల్ట్‌దుకాణాలపై దాడులు

రాజాపూర్: మండలంలోని పల్గుతండా, ఖానాపూర్ గ్రామాల్లో బెల్ట్‌షాపులపై పోలీసులు దాడులు చేశారు. ఖానాపూర్‌లో నరేందర్‌గౌడ్ కిరాణషాపులో బీర్‌బాటిల్స్‌ను అమ్మడంతో పాటు అధికధరలకు విక్రయిస్తున్నట్లు కానిస్టేబుల్ రాంజీ తెలిపారు. పల్గుతండాలో జటావత్ పూల్‌సింగ్ దుకాణంలో మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు కానిస్టేబుల్ సుభాష్‌రాథోడ్ తెలిపారు. వీటి విలువ రూ. మూడువేలకు పైగా ఉంటుందన్నారు. మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

షాపులు మూసివేయాలి

చిన్నచింతకుంట: బెల్టు షాపులను ప్రభుత్వం వెంటనే మూసివేసి ప్రజలను ఆదుకోవాలని ఉంధ్యాల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు ఇబ్రహీం కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో దాదాపుగా 20 బెల్టుషాపులలో విచ్చలవిడిగా విక్రయాలు కొనసాగిస్తున్నారన్నారు.

చదువుతో పాటు ఆటలు అవసరం



క్రీడాకారులతో ఎస్పీ హర్షవర్ధన్, శ్రీ చైతన్య చైర్మన్ శ్రీధర్ తదితరులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రతి విద్యార్థికి చదువు ఎంత ముఖ్యమో ఆటలు కూడా అంతే అవసరమని ఎస్పీ హర్షవర్ధన్ అన్నారు. శ్రీ చైతన్య విదా సంస్థల ఆధ్వర్యంలో శనివారం ఆటల పోటీలు నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడలతో విద్యార్థుల్లో మానసిక ధృఢత్వం పెరుగుతుందన్నారు. మానసికంగా బలంగా ఉంటేనే అనుకున్నది సాధిస్తారని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో క్రీడలపై విద్యార్థులకు అంతగా ఆసక్తి ఉండడం లేదన్నారు. ఈ నేపథ్యంలో వారికి క్రీడల ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. వారికి సెల్‌ఫోన్లను దూరం పెట్టాలన్నారు. క్రీడలపై ఆసక్తి పెంచేలా విద్యాసంస్థలు కృషి చేయాలన్నారు. డీఈఓ రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆటాపాటలు చాలా ముఖ్యమని అన్నారు. తమకు నచ్చిన క్రీడల్లో రాణించి పాఠశాలలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబచ్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఏఎస్పీ రాములు, ఎంఈఓ జయశ్రీ, శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్, ఎం. శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ మనోహర్, శ్రీధర్, కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

'చెకుముకి'లో సత్తాచాటిన విద్యార్థులు

హన్వాద: చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఇంగ్లీష్ మీడియం విభాగంలో ఎంజేపీ–హన్వాడ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన టెస్ట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. డీఈఓ రవీందర్ నుంచి జిల్లాకేంద్రంలో ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఎంఈఓ రాజునాయక్, చెకిముకి మండల కోఆర్డినేటర్లు మల్లేష్, రాఘవేందర్‌లు అభినందించారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థులు

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థి ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

కోయిల్‌కొండ: మండలంలోని వింజామూర్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థి భీమేశ్వరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన సోషల్ టాలెంట్‌టెస్ట్‌లో ప్రథమ బహుమతి సాధించిందని ప్రధానోపాధ్యాయులు రాజేందర్ శనివారం తెలిపారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయబృందంతో పాటు గ్రామస్తులు భీమేశ్వరిని అభినందించారు. నెల 10న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందని హెచ్‌ఎం వివరించారు.

న్యూరిషిలో విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులతో న్యూరిషి పాఠశాల సిబ్బంది

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని బాయమ్మతోట న్యూరిషి కాన్సెప్ట్ స్కూల్‌లో శనివారం స్వయంపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు శిరీష, పూజిత, చంద్రకళ, సుశాంత్‌కృష్ణ మాట్లాడుతూ స్వయంపాలన దినోత్సవంతో విద్యార్థుల్లో ఉపాధ్యాయుల పట్ల ఉన్న గౌరవం పెంపొందుతుందన్నారు. సమాజంలో పాఠశాల, ఉపాధ్యాయులు, విజ్ఞానం, అంశాలపై విద్యార్థులకు చిరు ప్రాయంలోనే గౌరవభావాలు పెంపొందించబడతాయని వారు పేర్కొన్నారు. బోధనలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపల్ రామకృష్ణ ప్రత్యేకంగా అభినందించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది నగిత, విజయ్, సుజాత, శాంతికుమార్, హర్షిత, శివకుమార్, శోభ, రజినీ, రామలక్ష్మి, సర్దార్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా

● అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు నిత్యం మినీ డీసీఎంలలో తరలుతున్న వైనం
● చోద్యం చూస్తున్న అధికారులు



శనివారం తెల్లవారుజామున వేముల స్టేజీ వద్ద ఇసుక లోడుతో వెళ్తున్న మినీ డీసీఎం

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి శివారులోని పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. రాత్రిపూట అదే గ్రామానికి చెందిన మినీ డీసీఎంలలో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత వాగులో ఇసుకను నింపుకొని భూత్పూర్, వేముల, అన్నాసాగర్, మహబూబ్‌నగర్‌లకు తరలిస్తున్నారు. కొమిరెడ్డిపల్లి నుంచి జాతీయ రహదారిపై అతివేగంతో ఈ వాహనాలు వెళ్తున్నాయి. నిత్యం అర్ధరాత్రి మొదలై తెల్లవారుజాము వరకు ఘటనలు కొనసాగుతున్నాయి. కాగా విషయంపై పోలీసులు, రెవెన్యూ అధికారులకు తెలిసినా పెద్దగా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికంగా నిర్మాణాలు చేపట్టిన చేపట్టిన వారు ఇసుక కొరతను ఎదుర్కొంటుంటే మరోవైపు అక్రమంగా ఇక్కడి నుంచే ఇసుక తరలిపోవడం చర్చనీయాంశంగా మారింది. గ్రామాల్లో ఇసుక అవసరమైన వారు ఎడ్లబండ్ల ద్వారా పగలే ఇసుకను తరలించుకుంటున్నారు. బండ్లకు ఎక్కువ ధర చెల్లించాల్సి రావడంతో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా మినీ డీసీఎంలలో ఒక ట్రాక్టర్, మరో సగం ట్రాక్టర్ ఇసుక తరలించే అవకాశం ఉంది. దీనికి తోడు అవి మితిమీరిన వేగంతో వెళ్లే అవకాశం ఉండటంతో వాటిని పట్టుకోవడం గ్రామస్తులకు ఇబ్బందులు కలిగిస్తోంది. ఇదిలా ఉంటే వాగులో ఇసుక తవ్వకాలు చేపట్టడం ద్వారా వాగు పరిసరాల్లోని బోరుబావులపై ప్రభావం పడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిరంతరం ప్రజలకు సేవలందిస్తాం



రక్తదాతలతో మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సాక్షినెట్‌వర్క్: ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం సేవలందిస్తామని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం జడ్చర్లలో తన జన్మదిన వేడుకల సందర్భంగా వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు ఆయనకు గజమాలతో స్వాగతం పలికి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా శిబిరం ఏర్పాటు చేయగా 1023 మంది రక్తదానం చేశారు. లక్ష్మారెడ్డి వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజనిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మిడ్జిల్‌లో వేడుకల్లో జెడ్పీటీసీ శశిరేఖ, ఎంపీపీ సుదర్శన్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేటలో రక్తదానం చేశారు. యువత అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, కోఆప్షన్ తాహేర్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్ పరిధిలోని సత్యేశ్వర ఆశ్రమంలో అనాథలకు అన్నదానం చేశారు. ఎంపీటీసీ శేఖర్‌గౌడ్, పార్టీ యూత్ అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ల అప్పగింత



బాలానగర్: మండలపరిధిలోని పలువురు మొబైల్‌ఫోన్లు పోగొట్టుకోగా.. వాటిని రికవరీ చేసిన పోలీసులు శనివారం బాధితులకు అప్పగించారు. గత నెల 24న నేరెళ్లపల్లిలో మిస్సయిన ఫోన్లను మహబూబ్‌నగర్ ఐటీకోర్ టీం సహకారంతో రికవరీ చేశామని ఎస్ఐ తిరుపాజీ వివరించారు. కాగా ఫోన్లు రికవరీ చేసి అందజేయడంతో బాధితులు హర్షం వ్యక్తం చేశారు. పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆరోగ్య శ్రీ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

పాలమూరు: జిల్లా ఆరోగ్య శ్రీ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం శనివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గిరిప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రదీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మురళీమోహన్, ఉపాధ్యక్షులుగా సరితా రాణి, వరప్రసాద్, కోశాధికారులుగా సంజీవ్, అరుణ, సలహాదారులుగా కృష్ణవేణి, మంజులతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. అనంతరం వారు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.